
# మనీప్లాంట్

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

**సన్నని బాల్కనీలో ఒకవైపున ఉంది అది.. దాని చివరలు కొంచెం పైపైకి సాగి తెల్లవారుఝామున గాలికి సన్నగా కదులుతు న్నాయి. ఆ పక్కనే కిటికీలో ఒక పాతకాలపు ఫొటో... అందులో నడివయసు దంపతులు... క్రింద ఏవో వివరాలు అస్పష్టంగా... ఫొటో మధ్యలోనూ చివర కొన్నిచోట్లా పురుగులు చేసిన రంధ్రాలు. చీకట్లు పూర్తిగా విడిపోతూ వెలుగు వచ్చేందుకు ఇంకా వ్యవధి ఉన్నట్టే ఉంది.**

చలికి గజగజ వణుకుతూ లోపలినుంచి ఇవతలికి వచ్చి అక్కడ నిరంతరం ఒకచోట నిలకడగా ఉండే పాతకుర్చీలో కూర్చున్నాడు మునుస్వామి. అతడు కూర్చోగానే ఆ కుర్చీ కట కటమని శబ్దం చేసింది. బహుశా నేడో రేపో అది విరిగిపోవడం ఖాయం. ఇక మీదట ఆ కుర్చీలో అజాగ్రత్తగా కూర్చోవడం ప్రమాదకరం. అన్నట్టు ఎప్పటిది ఈ కుర్చీ? అది ఎప్పటి నాటిది? అర్ధ శతాబ్ది నాటివిషయం బహుశా తమ పాత పల్లె టూరినీ స్వస్థలాన్నీ వదిలి ఎన్నో ఆశలతో దూర పట్నంలో ఒక చిన్న ఉద్యోగాన్ని నమ్ముకుని సర్వస్వంతో తరలివచ్చిన నాటి సంగతి. తనతో పాటు అప్పటికే కాటికి కాళ్లు చాచుకుని ఉన్న తల్లీ, తన కంటే మూడేళ్లు చిన్నవాడు తన తోడబుట్టినవాడు, ఇక్ష్వాకుల కాలంనాటి కొంత సామాగ్రి... ఇంతే తనవెంట...



వాటిలో ఏదీ మిగిలిలేదు ఇప్పుడు ఈ ప్రాణం లేని కుర్చీతప్ప.


తల్లి సొంత ఊరును వదిలి వచ్చిన బెంగతోనో పట్నవాసంలో ఉక్కిరిబిక్కిరి కావడం వల్లనో ఒక విచిత్రమైన వ్యాధితో బాధపడి అతిత్వరలోనే కన్నుమూసింది. తమ్ముడు చిత్తచాపల్యంతో దేశాలు పట్టిపోయాడు. ఏమయ్యాడో తెలియదు.

మునుస్వామి తుండు చెవుల చుట్టూ కప్పుకుంటూ మళ్ళీ దానివంక చూశాడు. ఒక వెడల్పాటి గాజు సీసాలో ఉంది అది. అట్టే పెరగనూ లేదు. అలాగని కుళ్లిపోయి చచ్చిపోనూలేదు. చిన్న చిన్న ఆకులు మూడో నాలుగో పండినవి ఎండున్నాయి. కొంచెం ఎత్తుకు సాగి ఇక ఎదగకుండా ఆగిపోయింది. చాలాకాలంనుంచీ అయితే అందరి యిళ్ళలో అలాకాదు. అతి తొందరగా తీగలు సాగుతూ పెరుగుతూ పోయి కిటికీలు గోడలు ఆక్రమించుకుంటూ ఎదుగుతూ పోతుంది కన్నుల పండువుగా పెద్ద పెద్ద అందమైన ఆకులతో పచ్చగా అద్భుతంగా ఉంటుంది. తనదే దురదృష్టం. కాలం గడిచినా అది ఎదగనూ లేదు. అలా అని కుళ్లిపోయి చచ్చిపోనూ లేదు. కుళ్లిపోతే ఎండిపోతే విసిరి అవతల పారేయవచ్చు. అలాకాక పెరగనూ పెరగక ఎండిపోనూ పోక అలా ఉంటే దుర్భరం కదూ!

ఇంట్లో ఏమాత్రమూ పెరుగుదల లేని ఒక పిగ్మీ అంగుష్ఠమాత్రుడు ఉన్నాడనుకోండి, ఆ బాధ వంటిదే ఇదీనూ. తాను ఎంత ఆశతో తెచ్చాడో దీన్ని? అసలు మిత్రులేమన్నారంటే 'అదృష్టరేఖ లేక ధనరేఖ చేతిలో ఉన్నవారి యింట్లోనే పెరుగుతుందిది' అన్నారు. ఆ రేఖ లేని దరిద్రుడి ఇంట్లో ఎంత ప్రేమగా ఎరువులు వేసి పెంచినా లాభం లేదనీ అన్నారు. పైగా దాన్ని మరోచోట నుంచి తెచ్చేటప్పుడు ఆ యింటివారికి తెలియకుండా, వారు గమనించకుండా దొంగచాటుగా అతిరహస్యంగా తీసుకురావాలి! అని కూడా అన్నారు. తాను అన్ని జాగ్రత్తలూ తీసుకుని మరీ ఒక మిత్రుడి ఇంటినుంచి తెచ్చాడు దాన్ని. ఆ యింట్లో అది సొగసుగా దట్టంగా కిటికీ అంతా ఆక్రమించుకుని వ్యాపించి ఉంది. పేరుతో సహా తన యింటికి దొంగతనంగా అవసరమైనంత మేరకు తెచ్చుకుని వెడల్పాటి గాజుసీసాలో ఉంచి మంచినీళ్లు పోసి ఎంతో అపురూపంగా చూసుకున్నాడు. కాని ఏం లాభం? నెలల తరబడి అది అలాగే ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయింది.

పక్కనే కిటికీలో పాతకాలపు ఫొటో ఒకటి తనను ఎప్పుడూ మానసిక అశాంతికి గురిచేస్తూ ఉంటుంది. అది తన యింటికి ఎప్పుడు వచ్చిందో తెలియదు. అందులో ఉన్నవారు ఎవరో ఎప్పటివారో ఎక్కడివారో తనకు తెలియనే తెలియదు. క్రింద వివరాలేవో మరీ అస్పష్టంగా ఉన్నాయి. దాన్ని ఇల్లు మారినప్పుడల్లా విసిరి అవతల పారేద్దామని అనుకున్నాడు గాని పారేయలేదు. అది కూడా తన సామాగ్రితోబాటు తనతోనే ఉంటూ వచ్చింది. ఆ ఫొటోలోని అపరిచితులెవరో అప్పుడప్పుడు మనుస్వామి కలలలోకి వచ్చి పరామర్శిస్తూ ఉంటారు కూడా.

ఇంత జీవితం గడిచిపోయింది. ఒక్కొక్కప్పుడు అతనికేమీ తోచదు. అందరూ పోయారు. ఒంటరితనం కాలక్రమేణా అలవాటయినా ఎప్పుడో ఒక బలహీన క్షణంలో విచిత్రమైన దిగులు మనసంతా ఆవరించుకుంటుంది. ఒంటరితనం అగాధసాగర గర్భం వంటిది. అక్కడ ఏ కదలికా అలజడీ శబ్దము ఉండదు. భయంకరమైన నిశ్శబ్దమే ఎల్లవేళలా.... అప్పుడప్పుడు ఒక మహా తిమింగలంలా ఒక మహా ఆక్టోపస్ కదిలిపోయినప్పుడు అంతా కాస్సేపు బీభత్సం ... అదీ కొద్దిసేపే... తరువాత మళ్లీ భీకర నిశ్శబ్దమే... అప్పుడు మనో యవనిక మీద పాతస్మృతి చిత్రాలు కదులుతాయి. ఏమీతోచక ఒంటరిగా కూర్చున్నప్పుడు చిన్నప్పటి తమ ఊరు గుర్తుకు వస్తుంది. ఊరంటే మొత్తం నలభై యాభై యిళ్లు... అన్ని అంతంత మాత్రపు కొంపలే. అయితే ఆ ఊరి అందమే అందం... ఊరి చుట్టూ పొలాలు. ఊరిమధ్యలో గుడి... గుడి ఎదురుగా కన్నులపండుగ చేస్తూ చెరువు. చెరువు నిండా కలువలు... తామరలు... గాలికి రెపరెపలాడుతూ నీటి ఉపరితలంమీద నిండాపరుచుకుని పచ్చటి ఆకులు... దూరంగా తాటితోపు... చివర ఒకవైపు ఏనాటిదో పెద్ద కుంకుడు చెట్టు... మరోపక్క గంగరావి చెట్టు... వీధిలో వరుసగా నాలుగైదు పున్నాగ చెట్లు... చుట్టూ వ్యాపించే పున్నాగపూల మెత్తటి పరిమళం... ఇప్పుడూ ఇన్నేళ్ల తర్వాత కూడా గుండెల్లో పదిలంగా ఉన్నట్టనిపిస్తుంది. దూరంగా బలిసిన వెదురు పొదలు. వాటిలో సుడివడి మధురంగా ధ్వనించేగాలి... కార్తీక మాసపు వెండివెన్నెలలు. గుడిలో కర్ణపేయంగా రవళించే గంటలు... ఊరికి దూరంగా బారులు బారులుగా దొంతరలు దొంతరలుగా కొండలు.. పొలాలమీద బారులు బారులుగా విచిత్రమైన క్రమశిక్షణతో ఎగురుతూ దూరతీరాలకు తరలివెళ్లే పక్షులు... శీతాకాలంలో దిగంతాలనుంచి వీచే పదునైన చల్లనిగాలి... ఉదయవేళల పలుచని పొగమంచు తెరలు... చిన్న చిన్న మొక్కలమీద వజ్రపు తునకలవలె మిలమిల మెరిసే మంచు బిందువులు.. పగలు గడవడం ఆలస్యం చీకట్లు వేగంగా కమ్ముకుంటూ వచ్చేవి... వెంటనే ఊరంతా నిద్రపోయేది.. చలికి వొణుకుతూ కడుపులో కాళ్లు పెట్టుకుని బొంతల మీద దుప్పట్లు కప్పుకుని వెచ్చగా పడుకోవడమే... వర్షాకాలం ఊరి షోకు చూడాలి. శ్రావణ భాద్రపదాలు రెండు నెలలూ ఊరంతా బురద... బురదేకాని మురుగు కాదు. ప్రతి ఇంటి వసారాలోనూ పెద్ద గంగాళంలోనో, తొట్టిలోనో నీళ్లుండేవి. పక్కనే చెంబు మరా ఉండేది.. పిచ్చిమొక్కల మీద

ఆరుద్ర పురుగులు కదులుతున్న పగడాలవలె తిరుగుతూ ఉండేవి. ఆకాశం క్షణక్షణానికీ రంగులు మారుస్తూ వింత వింత సోయగాలు కురిపించేవి.

అంతలోనే అకస్మాత్తుగా... అంతా అందమైన కలవలె కరిగిపోయింది. కాలపురుషుడు తన వికృత రాక్షసహస్తంతో ఒక అద్భుత కళాత్మక వర్ణచిత్రాన్ని ధ్వంసం చేసినట్టు.. నిశ్శబ్దంగా.. ఎవరూ గమనించలేనంత విచిత్రంగా అత్యంత సహజమనిపించేట్టుగా ఊరు మారింది. ఊరి తీరు మారింది. చెట్లు కూలిపోయాయి. పొలాలు బీళ్ళయిపోయాయి. కిచకిచ పిచ్చుకలు కనుమరుగైపోయాయి. ఊరిచుట్టూ చిన్నపెద్ద కార్ఖానాలు పరిశ్రమలూ వచ్చి పడ్డాయి. పరిమళభరితమైన స్వచ్ఛమైన మందమారుతం కరువై రకరకాల పొగలు సెగలు వ్యాపించాయి. ఊరి చుట్టూ పుష్కలంగా ఉన్న కొండరాయి, మరో వ్యాపారపదార్థమై జనజీవన సరళిని రూపుమాపింది. మునుస్వామి నిట్టూర్చాడు. ఎదురుగా చీకట్లు విడిపోయి పలుచని వెలుతురు వ్యాపిస్తున్నది. సూర్యోదయం కావడానికి మాత్రం ఇంకా వ్యవధి ఉన్నట్టే ఉంది.

అలా ఊరు మారుతూ వచ్చింది. ఎవరెవరో ఎక్కడెక్కడి వారో దిగారు. పెద్ద మొత్తాలలో అద్దెలు యిచ్చీ, ఖాళీ స్థలాలు ఆక్రమించీ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రకరకాల యంత్రాలు వచ్చాయి. అసంఖ్యాకంగా లారీలు తరలివచ్చాయి పెద్ద పెద్ద తవ్వోడలు భీకర శబ్దాలు చేసుకుంటూ ప్రత్యక్షమైనాయి. అవి తమ రాక్షస హస్తాలతో కొండను పగలగొట్టడం ప్రారంభించాయి. ఊరివారికి రకరకాల ఆదాయం లభ్యమైంది ఎన్నడూ లేనిది అద్దెల రూపంలో లక్ష్మీకటాక్షమయ్యే సరికి ఊరిజనం సుఖం మరిగారు. తమ తమ పొలాలను ఖాళీస్థలాలను ఎవరు ఎవరికో అర్పించి 'కృతార్థుల'యినారు. కొత్త కొత్త కట్టడాలు మొదలైనాయి. బహుశా అంతస్థుల నిర్మాణాలు కొద్ది వ్యవధిలోనే వెలిశాయి. స్థలం కరువైంది. జన సంఖ్య పెరిగింది. టీ దుకాణాలు.. ఆ పైన రెస్టారెంట్ అండ్ బార్లు.. వాటితోపాటు వైన్ షాపులు... చికెన్ సెంటర్లు మొదలైనాయి. మోటారు సైకిళ్ల వేగంగా తిరిగాయి. కొన్ని కార్లు ప్రత్యక్షమైనాయి. స్థానికేతరులతో ఊరు పట్నంగా మారింది. పెద్ద వీధిలోని పున్నాగ చెట్లు అంతరించి పోయి రోడ్డు పడింది. ఊరివారు ధనికులైనారు. కుర్రకారు కొందరు 'చదువులు చదువులు' అంటూ దూరపు బస్తీలకు నగరాలకూ తరలివెళ్లి చదువులు పూర్తిచేసి ఉద్యోగాలలో ఎక్కడెక్కడో స్థిరపడి ఊరును మరిచిపోయారు. అతి అరుదుగా పెళ్ళిళ్ళకు చావులకు తప్ప ఊరిలో వారికి అనుబంధ సూత్రం సున్నితమై క్రమక్రమంగా తెగిపోయింది. పాతతరం వారు మిగిలి ఉంటే వారిలో అంతంత మాత్రపు పలకరింపులు, పరామర్శలు తప్ప ఏమీ మిగలలేదు. పెద్దవారు రాలిపోతూ ఉంటే చాలాకుటుంబాలలో స్మృతి చిహ్నాలు కూడా మిగలలేదు. ఆస్తులు ఇళ్ల స్థలాలు ఎక్కువ భాగం పరాయివారి పాలైనాయి. ఊరంతా రాతి ముక్కలు.. రాతి దుమ్ము... రాతి పొడి... రాతి వాసన.. ఆ రాళ్ల పరిశ్రమకు సంబంధించిన యంత్రాల ధ్వనులు.. రాతి పలకలు.. లారీలు... ఎగుమతులు. ఇలా అంతా కోట్లు కుమ్మరించే రాతి పరిశ్రమ కేంద్రమై పాత వాసనను కోల్పోయి కేవలం పదిహేను, ఇరవై సంవత్సరాలలో అంతా మారిపోయింది. ఇంతకుముందు కొడవళ్లు పుచ్చుకుని పంచెలు ఒకపక్క పైకి దోపి నడుస్తూ కనిపించిన రైతు సంతానం కనుమరుగైపోయింది. స్క్రూడైవర్లు రెంచిలతో మెకానికులు ఎక్కువైనారు. ఇళ్లముందు ఖాళీస్థలం రవ్వంత ఉంటే ఇంతకుముందు మందారాలు, నందివర్ధనాలు, బంతిమొక్కలు కనువిందు చేసేవి. పాకలమీద గుమ్మడి చిక్కుడు సొరపాదులు ఉండేవి.. ఇప్పుడు ఉన్న సిమెంటు కట్టడాలు... కాస్త ఖాళీ స్థలం మిగిలితే ఒక చిన్న దుకాణం... అందులో సిగరెట్లు, గుట్కాల వ్యాపారం... ఇళ్లముందు అరుగు తిన్నెలు మిగలనే లేదు. ప్రతిచోటా నోట్ల రెపరెపలు, అంతా గారడీలేని మాయా సృష్టి వలె అతి వేగంగా కొత్త ప్రపంచం వెలిసింది. పట్నానికీ ఊరికీ మధ్య దూరం తగ్గింది. మునుస్వామి తన పాతకాలపు కొంప నేలమట్టం అయిపోతూ ఉంటే చూసి భరించలేక ఒక బిల్డరుకు అప్పగించేశాడు. ఆ బిల్డరు గొప్ప ముందుచూపుతో బాగా విస్తరిస్తున్న పట్నాన్ని దృష్టిలో పెట్టుకుని అమిత సాహసంతో ఆకాస్త స్థలంలో నాలుగంతస్థుల, పదకొండు అపార్ట్‌మెంట్ల భారీనిర్మాణాన్ని చేపట్టి మునుస్వామికి నాలుగు అపార్ట్‌మెంట్లు అప్పగించేట్టు ఒప్పందం చేసుకున్నాడు. మునుస్వామికి అదొక సువర్ణావకాశంగా కనిపించింది. తాను తనకోసం ఒక ఫ్లాట్ ఉంచుకుని మిగిలిన మూడింటినీ అమ్మి సొమ్ము చేసుకుందామని ఉబలాటపడ్డాడు. ఆ పథకం మొత్తం అరకొరగా పూర్తి కావడానికి మూడేళ్ళు పట్టింది. ఆ బిల్డరు జరుగుతున్న జాప్యానికి సవాలక్ష సజావైన కారణాలు చూపించేవాడు. మొత్తానికి అంతా అస్తవ్యస్తమై ఆ పథకం విఫలమై బిల్డరు బాగుపడి తప్పుకున్నాడు.

మునుస్వామికి మిగిలింది ఒక ఇరుకు ఫ్లాట్ మాత్రమే. ఇక రావలసిన డబ్బు, అతని చేతిలో ధనరేఖ మహా బలహీనమైనది కావడం చేత చిన్న చిన్న మొత్తాలలో ఎందుకూ కొరగాకుండా అసంపూర్తిగా ముట్టింది.

ఆ కాస్తా పుట్టమీద పడిన మంచు బిందువులు అదృశ్యమైనట్టు మాయమైపోయింది. ఏమీ మిగలలేదు.

మునుస్వామి కళ్లు నులుముకున్నాడు. ఎదురుగా వెలుతురు...చీకట్లు తొలిగిపోయి ఒక పక్క ఆకాశంలో ఎర్రని రంగు పరుచుకుంటున్నది. క్రింద వీధిలో, ఇళ్లమధ్య రకరకాల వైర్లు... అసంఖ్యాకంగా తీగలు.. మనుషుల చెవులలోనూ తీగలు... చేతులలో, జేబులలో, స్త్రీల చేతి సంచులలో, పురుషుల బెల్టులలో ఎక్కడ బడితే అక్కడ దూరవాణి యంత్రాలు.. నిరంతర వ్యర్థసంభాషణలు.. పొద్దెక్కేకొద్దీ అంతటా అలజడి... రొద...

ఎవరో తలుపుమీద శబ్దం చేస్తున్నారు.

మునుస్వామి లేచాడు. మనీప్లాంట్ అలాగే జవమూ, జీవమూ లేకుండా నిశ్చలంగా ఉంది... అలాగే ఉంటుంది ఎప్పటికీ... ఆ పక్క పాత ఫ్లాటులోని వారెవరో ఎప్పటికీ తెలియదు.

అతడు లేచి ముందు గదిలోకి వచ్చి తలుపు తీశాడు. ఇంతకుముందు తనను ఎవరో పిలిచినట్టూ తలుపు తట్టినట్టూ అనిపించిందా, ఇప్పుడు చూస్తే ఎవరూ లేరక్కడ... తన జీవితంలాగే, తన ఊరిలాగే.. అంతా వ్యర్థంగా... జీవరహితంగా.. శూన్యంగా ఉంది.

★

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

98495 50924

